

ఘనంగా నాగుల పంచమి
గ్రామాల్లో సోమవారం నాగుల పంచమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పుట్టల వద్ద పూజలు చేసి, పాలు పోసి మొక్కులు చెల్లించారు. 9లో▸



బీఆర్ఎస్ శ్రేణుల సంబరాలు
బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించడంతో వారి మద్దతుదారులు ఆయా నియోజకవర్గాల్లో సంబరాలు చేసుకున్నారు. టపానులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.0 /25.7

వాతావరణం
ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్పీకి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



ఎస్పీ సురేశ్‌కుమార్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావుకు సోమవారం బ్రహ్మకుమారీలు మనీషా, నాగమణి రాఖీ కట్టారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఉద్యోగుల ప్రతిభ



అభినందిస్తున్న డీవైఎస్‌వో మీనారెడ్డి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు పీఈటీలు ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన సివిల్ సర్వీస్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపారు. పతకాలు సాధించిన వారిని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో డీవైఎస్‌వో మీనారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంగిడి మాదరం పీఈటీ లక్ష్మణ్ జావెలిన్ త్రో విభాగంలో బంగారు పతకం, బెజ్జూర్ ఆశ్రమ పాఠశాల పీఈటీ మంగవతి డిస్కస్ త్రో విభాగంలో బంగారు పతకం, అనార్‌పల్లి పీఈటీ కృష్ణమూర్తి డిస్కస్ త్రోలో వెండి పతకం సాధించినట్లు తెలిపారు. విజేతలు జాతీయస్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఉద్యోగులను ఏసీఎంవో ఉద్దవ్, జీసీడీవో శకుంతల, నరేందర్ తదితరులు అభినందించారు.

బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



అర్జీ పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వహించొద్దన్నారు. చట్టపరిధిలో బాధితులకు న్యాయం చేసేందుకు వేగంగా చర్యలు తీసుకుని, వారికి భరోసా కల్పించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు.


ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌అర్బన్: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.517 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి భీమేశ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని ప్రకటించినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలు, ఎస్‌ఎంహెచ్ వసతి గృహాలు అద్దె గృహాల్లో నడుస్తున్నాయని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వసతిగృహాల్లో మెనూ, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు జాఫర్, ప్రకాశ్, రాంచందర్, సాయినాథ్, వినీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాత వారికే మళ్లీ చాన్స్



- బీఆర్ఎస్ తొలి జాబితా ప్రకటించిన కేసీఆర్
- ఆసిఫాబాద్ బరిలో కోవ లక్ష్మి
- సిర్పూర్ నుంచి కోనప్ప పోటీ..
- 2018లో పార్టీ తరుఫున పోటీ చేసిన వారికే టికెట్లు

సాక్షి, ఆసిఫాబాద్: రానున్న శాసనసభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లను బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రకటించారు. శ్రావణమాసం.. సోమవారం శుభ మూహూర్తన సీఎం కేసీఆర్ ప్రకటించిన తొలి జాబితాలోనే కుమురంభీం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల పేర్లు ఉండడంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంలో మునిగిపోయారు. 2018 ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీ చేసిన పాత వారికే అధినేత మరో అవకాశం ఇచ్చారు. ఆసిఫాబాద్ టికెట్ విషయంలో కొన్ని రోజులుగా ప్రచారంలో ఉన్న ఊహాగానాలకు తెరదించుతూ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మికి టికెట్ ఖరారు చేయడం .. అలాగే సిర్పూర్(టి) నియోజకవర్గ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పను రెండోసారి ఎంపిక చేయడం ద్వారా గెలుపు గుర్రాలకే టికెట్ అన్న సంకేతం సీఎం కేసీఆర్ పంపినట్లైంది. అయితే ఆసిఫాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కోవ లక్ష్మితో కలిసి పనిచేయాలని, ఆయనకు పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని కేసీఆర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండు నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారు కావడంతో కాంగ్రెస్, బీజేపీలో టికెట్లు ఆశిస్తున్న నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

వారికే మళ్లీ టికెట్లు..

అధికార బీఆర్ఎస్ పార్టీ త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల బరిలో మళ్లీ పాత వారినే నిలిపింది. గత ఎన్నికల్లో అధికార పార్టీ తరఫున ఆసిఫాబాద్ నుంచి కోవ లక్ష్మి, సిర్పూర్ నియోజకవర్గం నుంచి కోనేరు కోనప్ప పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కోనేరు కోనప్ప విజయం సాధించగా.. కోవ లక్ష్మి ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సక్కు చేతిలో 172 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యింది. ఆ తరువాత ఆత్రం సక్కు అధికార పార్టీ తీర్థం పుచ్చుకున్న నేపథ్యంలో కొంత నిరుత్సాహనికి గురైన కోవ లక్ష్మి 2023 ఎన్నికల్లో టికెట్ సాధించడమే లక్ష్యంగా పనిచేస్తూ నిరంతరం ప్రజల్లో ఉంటూ తన బలాన్ని పెంచుకుంది. అదే సమయంలో ఆత్రం సక్కు సైతం నియోజకవర్గంలో తన పట్టు సాధించేందుకు ప్రయత్నం చేశారు. అయితే కొంత కాలంగా అభ్యర్థుల విజయావకాశాలపై బీఆర్ఎస్ అధినేత విస్తృతంగా సర్వేలు చేయించారు. ఆ సర్వేల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేకు ప్రతి కూల జనాభిప్రాయం రావడం.. అదే సమయంలో కోవ లక్ష్మికి అనుకూలంగా సర్వేలు ఉండడంతో అధినేత కోవ లక్ష్మికే టికెట్ ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక సిర్పూర్ నియోజకవర్గ అభ్యర్థి విషయంలో అధిష్టానం మరో ఆలోచన చేసే ప్రయత్నం చేయలేదు. ఎందుకంటే ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు కోనేరు కోనప్ప నియోజకవర్గ ప్రజల మనిషిగా పేరుంది. ఎక్కడ ఎవరికి ఏ ఆపద వచ్చినా ఎమ్మెల్యే వెంటనే స్పందించడమే కాకుండా అవసరమైతే తానే స్వయంగా అక్కడకు వెళ్లడం కూడా చేస్తారు. అదే సమయంలో పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తుండడంతో ఎక్కడా అసంతృప్తి లేదు. బూత్‌స్థాయి నుంచి మండల స్థాయి వరకు బలమైన క్యాడర్‌ను ఏర్పాటు చేసుకోవడంతో సిర్పూర్ టికెట్ కోనప్పనే వరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కోవ లక్ష్మి మూడోసారి ఎమ్మెల్యే ఎన్నికల బరిలో నిలవనుండగా.. కోనప్పకు ఇది ఐదోసారి కానుంది.

బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్..

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఖరారు కావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో టపాసులు పేల్చి సంబురాలు జరుపుకొన్నారు. అలాగే కాగజ్‌నగర్‌లో కూడా కోనప్పకు పార్టీ టికెట్ ప్రకటించగానే కార్యకర్తలు రాజీవ్‌గాంధీ చౌక్ వద్ద టపాసులు పేల్చి సంబురాలు జరుపుకోగా.. మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ఇంటి వద్ద ఆయన సతీమణితో కలిసి కేక్ కట్ చేసి సంతోషం పంచుకున్నారు.

మళ్లీ నన్ను ఆదరిస్తారని నమ్ముతున్నా..

ఆసిఫాబాద్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ నాకు మూడోసారి అవకాశం ఇచ్చారు. మొదటి సారి నన్ను నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారు. రెండోసారి స్వల్ప మెజార్టీతో ఓడిపోయానని ప్రజలందరూ బాధపడ్డారు. మళ్లీ మూడోసారి నాకు ముఖ్యమంత్రి అవకాశం కల్పించారు. గతంలో మాదిరిగానే నన్ను ఓ చెల్లిగా, అక్కగా, తల్లిగా ఆశీర్వదించి ఈసారి గెలిపిస్తారని ఆశిస్తున్నా.

– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి

పేదలకు ఎంతో మంచి చేశాం

పేద ప్రజల కోసం మా ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసింది. వారికి మంచి చేశామన్న సంతోషం ఉంది. సీఎం కేసీఆర్ అండదండలతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. ఇది కొనసాగుతుంది. బీఆర్ఎస్ పార్టీ తరఫున నేను రెండోసారి బరిలో దిగుతున్నా. నాపై ఎవరైనా పోటీ చేయవచ్చు. ఇది ప్రజాస్వామ్యం. కానీ మేం చేసిన మంచి పనులను గుర్తించి ప్రజలు మమ్మల్ని ఆశీర్వదిస్తారని నమ్ముతున్నా. రానున్న ఎన్నికల్లో మా వైపే ప్రజలు ఉన్నారని తేలుతుంది.

– కోనేరు కోనప్ప, ఎమ్మెల్యే, సిర్పూర్ నియోజకవర్గం

అభినందనల వెల్లువ



కోనేరు కోనప్పకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే సక్కు, ఎమ్మెల్సీ విఠల్

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆసిఫాబాద్, సిర్పూర్ పార్టీ అభ్యర్థులుగా కోవ లక్ష్మి, కోనేరు కోనప్పను ప్రకటించడంతో సోమవారం హైదరాబాద్‌లో వారికి అభినందనలు వెల్లువెత్తాయి. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, దండె విఠల్, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా జాన్సన్ నాయక్‌ను ప్రకటించడంతో ఆయన ఎమ్మెల్యే కోనేరు కోనప్పను కలిశారు. అలాగే రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని ఎమ్మెల్యే కోనప్ప మర్యాదపూర్వకంగా కలిశారు.



కోవ లక్ష్మికి స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

‘సీట్ల కేటాయింపులో బీసీలకు మొండిచేయి’

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న ఎన్నికల సందర్భంగా ప్రకటించిన అసెంబ్లీ సీట్ల కేటాయింపులో బీఆర్ఎస్ పార్టీ బీసీలకు మొండిచేయి చూపిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నర్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలను పక్కకు పెట్టారని ఆరోపించారు. కేసీఆర్ విడుదల చేసిన జాబితాను రద్దు చేసిన 70 శాతం సీట్లను బీసీలకు కేటాయిస్తూ నూతన జాబితా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీలను ఏకం చేసి బీఆర్ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోసే శంకర్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, నాయకులు మారుతి పటేల్, సోమేశ్వర్‌రావు, నారాయణ, గాగోరావు, గౌరయ్య, మొండి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

- ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లకు ఉన్నతి అభ్యసనాభివృద్ధి మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు. ఇన్‌చార్జి డీఈవో మాట్లాడుతూ 6 నుంచి 9 తరగతి విద్యార్థులు చదవడం, రాయడంతోపాటు అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా తీర్చిదిద్దడం ఈ ఉన్నతి అభ్యసనాభివృద్ధి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. త్వరలో పదో తరగతి విద్యార్థుల కోసం లక్ష్యం అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోలు శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు

కేంద్ర బలగాలకు ఎంపికైన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న సీఐ సురేశ్‌కుమార్, తదితరులు

ఆసిఫాబాద్: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా కేంద్ర బలగాలకు ఎంపికైన జిల్లా కేంద్రానికి చెందిన యువకులను సీఐ సురేశ్‌కుమార్ సోమవారం సన్మానించారు. బజార్‌వాడికి చెందిన సయ్యద్ సుల్తాన్ అలీ(సీఐఎస్‌ఎఫ్), ఉస్మానియా కాలనీకి చెందిన ఉమర్ బిన్ రైస్(సీఐఎస్‌ఎఫ్), తారకరామానగర్‌కు చెందిన రామడుగుల సాయి(ఐటీబీపీ), రాజంపేటకు చెందిన పిడుగు మనికృష్ణ(సీఐఎస్‌ఎఫ్)ను తారకరామానగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాలతో సన్మానించారు. సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి దేశానికి రక్షణగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు రఫీక్ జివాని, గిరీశ్, సతీశ్‌కుమార్, శ్రవణ్, నరేశ్, ప్రతాప్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఉత్కంఠగా సాగిన లక్కీడ్రా

- ముగిసిన మద్యం టెండర్ల ప్రక్రియ
- ఐదు దుకాణాలకు లాటరీ వాయిదా
- షాపు పొందిన వారిలో జోష్.. దక్కని వారిలో నిరాశ
- డిసెంబర్‌లో కొత్త లైసెన్స్‌లు ప్రారంభం



లక్కీడ్రా టోకెన్ చూపిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియ సోమవారం నిర్వహించిన లక్కీడ్రాతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 32 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించగా, 27 దుకాణాలను లక్కీడ్రా ద్వారా కేటాయించడంతో ఉత్కంఠకు తెర పడింది. పది కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన ఐదు దుకాణాలకు లక్కీడ్రా వాయిదా వేశారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య జిల్లా కేంద్రంలోని కుమురంభీం ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన లక్కీడ్రా ద్వారా వ్యాపారులు దుకాణాలు దక్కించుకున్నారు. ఆదిలాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ మోసిన్ అలీ, జిల్లా ఎక్సైజ్ శాఖ ఉద్యోగుల సమక్షంలో వీడియో రికార్డింగ్ ద్వారా కలెక్టర్ హేమంత్ బోర్కడే స్టీలు డబ్బాలో ఒక్కో దుకాణానికి గెజిట్ నంబర్ ప్రకారం లాటరీ విధానం ద్వారా షాపుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. షాపుల వారీగా ప్లాస్టిక్ కాయిన్‌లు తీశారు. షాపులు గెలుచుకున్న వారు ఫుల్‌జోష్‌లో ఉండగా, రూ.లక్షలు వెచ్చించి టెండర్ వేసినా దుకాణాలు రాని వారు నైరాశ్యంతో తిరిగి వెళ్లారు. టెండర్లలో పలువురు మహిళలు సైతం పాల్గొని దుకాణాల కోసం పోటీపడ్డారు. జిల్లాలో అత్యధికంగా దహెగాం వైన్స్‌కు 86 దరఖాస్తులు వచ్చాయి. దుకాణాలు దక్కించుకున్న వారు వెంటనే లైసెన్సు ఫీజు కింద 25 శాతం ఫీజు చెల్లించే విధంగా అక్కడే బ్యాంకు సిబ్బందితో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. డిసెంబర్ 1 నుంచి మద్యం విక్రయాలు ప్రారంభించవచ్చు.

967 దరఖాస్తులు

32 షాపులకు మొత్తం 967 దరఖాస్తు వచ్చాయి. ఇందులో 27 మందికి మాత్రమే దుకాణాలు దక్కాయి. లాటరీలో దుకాణాలు పొందని వారు తీవ్ర నైరాశ్యంలో మునిగారు. ఒక్కో షెడ్యూల్‌కు రూ.2 లక్షలు వెచ్చించినా దుకాణాలు పొందలేకపోయామని ఆవేదన చెందుతున్నారు. కొంతమంది ముహూర్తం చూసుకుని దరఖాస్తు వేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొన్నేళ్లుగా మద్యం వ్యాపారాల్లో ఉండి.. ప్రస్తుత టెండర్లలో దుకాణాలు రానివారు ఎలాగైనా మళ్లీ షాపు పొందేందుకు గుడ్‌విల్ కింద కొంత ముట్టజెప్పి దుకాణాలు పొందేందుకు వెనకాడటం లేదు. ఒక్కో గ్రూపులో 10 నుంచి 16 మంది వరకు సభ్యులుగా ఏర్పడి టెండర్లు దాఖలు చేశారు. దీంతో దుకాణాలు పొందిన వారి భాగస్వామ్యం పెరిగిపోయింది. గ్రూపులో ఉన్న వారికి కూడా ఎంతో కొంత ముట్టజెప్పి భాగస్వామ్యం తగ్గించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

దుకాణాలు పొందిన వారు వీరే..

జిల్లాలో 32 మద్యం దుకాణాలకు 27 దుకాణాలకు లక్కీడ్రా నిర్వహించారు. గెజిట్ నంబర్ ప్రకారం ఆసిఫాబాద్- 01 షాపును చిలుకూరి తిరుపతి, ఆసిఫాబాద్- 02 ఆలేటి శ్రీరాం, ఆసిఫాబాద్- 03 పల్లె సంతోష్‌కుమార్, ఆసిఫాబాద్- 04 బెండారె దివాన్‌జీ, ఆసిఫాబాద్- 05 పెంటపర్తి ప్రశాంత్, ఆసిఫాబాద్- 06 ఆర్.శంకర్, వాంకిడి- 01 చాప్లె భీమ్‌రావు, వాంకిడి- 02 మల్లుగూరి నర్సింహులుగౌడ్, గంగాపూర్(రెబ్బెన) ఆత్మకూరి రమ్యకృష్ణ, విజయనగరం కాలనీ(తిర్యాణి)- బి.నవీన్‌గౌడ్, గోయాగాం(కెరమెరి) పల్లె సంతోష్‌కుమార్, జైనూర్ రాథోడ్ వసంత్‌రావు, కాగజ్‌నగర్- 01 గోవిందుల రాజన్న, కాగజ్‌నగర్- 02 ముద్దసాని శ్రీరాములు, కాగజ్‌నగర్- 03 కంబంపాటి సతీశ్‌కుమార్, కాగజ్‌నగర్- 04 చిలువేరు గంగాధర్, కాగజ్‌నగర్- 05 వటామి శివప్రసాద్, కాగజ్‌నగర్- 06 దుర్గం సంజీవ్, సిర్పూర్(టి) పైడి హరీశ్‌కుమార్, నజ్రూల్‌నగర్ వల్లాల సోమానందం, రవీంద్రనగర్ సుజీత్ సర్కార్, కౌటాల- 01 నాగుల తిరుపతి, కౌటాల- 02 బోడకుంట వేణుగోపాల్, బెజ్జూర్ మదాడి సునీల్‌కుమార్‌రెడ్డి, పెంచికల్‌పేట్ దోంగ్రి రంగులు, దహెగాం వేముల రవీందర్, గూడెం షాపును గోరంటాల అరుణ్‌కుమార్ దక్కించుకున్నారు. 10 కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన రెబ్బెన, గోలేటి, లోనవెల్లి, సిర్పూర్(యూ), లింగాపూర్ షాపుల లక్కీడ్రాను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆదిలాబాద్ డిప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి తెలిపారు.

‘ఓటమి భయంతోనే రెండు చోట్ల పోటీ’


ఆసిఫాబాద్‌అర్బన్: ఓటమి భయంతోనే సీఎం కేసీఆర్ రెండుచోట్ల పోటీ చేసేందుకు సిద్ధమయ్యారని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ బుక్యా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు రాజన్న రాజ్యం కోసం ఎదురుచూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాలో తమను ఆదరించాలని ఆయన కోరారు.

బీజేపీని గెలిపించాలి

ఆసిఫాబాద్: జిల్లా అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని మహారాష్ట్రకు చెందిన ఎమ్మెల్యే బంటి బాంగ్డియా అన్నారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నం.2 గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. మెరుగైన రహదారులు, వసతులు, సాగునీటి కోసం బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు, సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తిర్యాణి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ గడ్చిరోలి ఎమ్మెల్యే దేవరావు మడ్ హోలి అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆత్మారాం, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, నాయకులు రమేశ్‌గౌడ్, వెంకటేశ్, లక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బంటి బాంగ్డియా


గులాబీ గెలుపు గుర్రాలు వీరే..

• బీఆర్‌ఎస్‌ అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్‌
• జిల్లాలో ముగ్గురు సిట్టింగ్‌లకు దక్కని టికెట్‌ • అభ్యర్థుల నేపథ్యం ఇదీ..

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో బీఆర్‌ఎస్‌ దూకుడు పెంచింది. అందరికంటే ముందుగానే పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌ అభ్యర్థులను ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ముగ్గురు సిట్టింగులకు చాన్స్‌ దక్కలేదు. వారిస్థానంలో కొత్తవారికి టికెట్‌ ఇచ్చారు. నియోజకవర్గాల వారీగా మొత్తం పది మంది అభ్యర్థుల రాజకీయ నేపథ్యం ఇలా ఉంది..

నిర్మల్‌ నియోజకవర్గం





పేరు : అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
తల్లిదండ్రులు : నారాయణరెడ్డి, చిన్నమ్మ
భార్య : విజయలక్ష్మి
కూతురు, అల్లుడు : పల్లవిరెడ్డి, రంజిత్‌రెడ్డి
కుమారుడు, కోడలు : గౌతమ్‌రెడ్డి, దివ్యారెడ్డి
పుట్టినతేదీ : 16–02–1949
విద్యార్హత : బీకాం, ఎల్‌ఎల్‌బీ
రాజకీయ ప్రస్థానం

- 1987లో జరిగిన పరిషత్‌ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా పరిషత్‌ చైర్మన్‌గా వ్యవహరించారు.
- 1991లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 1999, 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 2008 పార్లమెంట్‌ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి 2009 వరకు ఆదిలాబాద్‌ ఎంపీగా ఉన్నారు.
- 2014లో బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా గెలిచి సెప్టెంబర్‌ వరకు రాష్ట్ర గృహనిర్మాణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రిగా కొనసాగారు.
- 2018నుంచి రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

ఆసిఫాబాద్‌ నియోజకవర్గం






పేరు : కోవ లక్ష్మి
భర్త : సోనేరావ్‌
తండ్రి : కోట్నాక్‌ భీంరావ్‌ (గిరిజన సంక్షేమశాఖ మాజీమంత్రి)
తల్లి : భీంబాయి
కులం : ఎస్టీ(గోండు)
పుట్టిన తేదీ : 6–2–1969
విద్యార్హత : పదోతరగతి
సంతానం : కుమార్తెలు అరుణ (సిర్పూర్‌(యూ) జెడ్పీటీసీ, మాన్విత, కుమారుడు సాయినాథ్‌
రాజకీయ ప్రస్థానం : 1995, 2001లో తిర్యాణి మండలం పంగిడిమాదర నుంచి ఎంపీటీసీ
2002 : తిర్యాణి ఎంపీపీగా
2006 ఆసిఫాబాద్‌ సర్పంచ్‌
2010 : టీఆర్‌ఎస్‌(ప్రస్తుత బీఆర్‌ఎస్‌)లో చేరిక
2013 : రెండోసారి ఆసిఫాబాద్‌ సర్పంచ్‌గా ఎన్నిక
2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్‌ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
2018 : ఆసిఫాబాద్‌ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు.
2019 : జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక

సిర్పూర్‌(టి) నియోజకవర్గం





పేరు : కోనేరు కోనప్ప
తల్లిదండ్రులు : సూర్య నారాయణ, కృష్ణవేణి
కులం : ఓసీ (కమ్మ)
పుట్టిన తేదీ : 07–10–1955
విద్యార్హత: ఇంటర్‌
భార్య: రమాదేవి
పిల్లలు : కూతురు ప్రతిమ, కుమారుడు వంశీకృష్ణ
నివాసం : గుంటూరు కాలనీ, కాగజ్‌ నగర్‌
రాజకీయ ప్రస్థానం :
1999 : కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.
2004 : కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.
2009 : కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.
2014 : బీఎస్పీ నుంచి గెలుపుపొంది టీఆర్‌ఎస్‌లో చేరారు.
2018 : టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.

చెన్నూర్‌ నియోజకవర్గం





పేరు: బాల్క సుమన్‌
తల్లిదండ్రులు: బాల్క సురేశ్, ముత్తమ్మ
కులం: మాల
పుట్టినతేదీ: 18–10–1983
భార్య : రాణి అలేఖ్య
కుమారులు : సుహాన్, సుషన్‌
స్వస్థలం : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం, రేగుంట
విద్యాభ్యాసం: డిగ్రీ
రాజకీయ ప్రస్థానం :

- 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. 2007లో టీఆర్‌ఎస్వీ ఓయూ అధ్యక్షుడిగా, 2010లో టీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2009 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు.
- 2014లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి టీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ప్రత్యర్థి కాంగ్రెస్‌ అభ్యర్థి గడ్డం వివేకానందపై 2.91 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.
- 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్‌ నియోజకవర్గం నుంచి టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్‌ అభ్యర్థి బోర్లకుంట వెంకటేశ్‌ నేతపై 28,132 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రస్తుతం చెన్నూర్‌ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌గా కొనసాగుతున్నారు.

బెల్లంపల్లి నియోజకవర్గం





పేరు: దుర్గం చిన్నయ్య
తల్లిదండ్రులు: దుర్గం రాజయ్య, మల్లక్క
భార్య:జయతార
సంతానం: ఇద్దరు కూతుర్లు (నిహారిక , విహారిక)
కులం: ఎస్సీ (నేతకాని)
పుట్టినతేదీ: 31–05–1972
విద్యార్హత: డిగ్రీ, బీఏ
స్వస్థలం: జెండా వెంకటాపూర్, నెన్నెల (మం) వృత్తి:వ్యవసాయం
నివాసం: మంచిర్యాల
రాజకీయ ప్రస్థానం

- 1995 లో టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా రాజకీయ రంగప్రవేశం.
- 1995 లో నెన్నెల జెడ్పీటీసీగా టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2001లో టీడీపీ నుంచి జంగాల్‌పేట్‌ ఎంపీటీసీగా గెలిచి నెన్నెల ఎంపీపీగా గెలిచారు.
- 2009 లో టీఆర్‌ఎస్‌లో చేరిక
- 2011లో బీఆర్‌ఎస్‌ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.
- 2014 లో చిత్తాపూర్‌ ఎంపీటీసీగా టీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి బెల్లంపల్లి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

ముధోల్‌ నియోజకవర్గం





పేరు : గడ్డిగారి విఠల్‌రెడ్డి
తల్లిదండ్రులు : గడ్డెన్న, రాజమ్మ
పుట్టినతేదీ : 06–08–1954
పుట్టిన ఊరు : దేగాం, భైంసా మండలం
విద్యార్హత : బీఏ, ఎల్‌ఎల్‌బీ
భార్య : గడ్డిగారి లక్ష్మి
కూతురు, అల్లుడు : సులోచన, శ్రీనివాస్‌రెడ్డి
కుమారుడు, కోడలు : రాంరెడ్డి, అక్షయ
రాజకీయ ప్రస్థానం

- 2006 నుంచి 2008 వరకు భైంసా మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా చేశారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పీఆర్పీ నుంచి పోటీ చేసి కేవలం 183 ఓట్లతో ఓడిపోయారు.
- 2010 నుంచి 13వరకు మరోసారి భైంసా మార్కెట్‌ కమిటీ చైర్మన్‌గా చేశారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 2014 ఆగస్టు 6న బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి రెండోసారి బంపర్‌ మెజార్టీతో గెలిచారు.

మంచిర్యాల నియోజకవర్గం





పేరు : నడిపెల్లి దివాకర్‌రావు
తల్లిదండ్రులు: రమాదేవి, లక్ష్మణ్‌రావు
భార్య: రాజకుమారి
కుమారులు: రంజిత్, విజిత్‌కుమార్‌
స్వస్థలం: పాతమంచిర్యాల
పుట్టినతేదీ : 15 ఆగస్టు, 1952
విద్యార్హత : బీఏ(పొలిటికల్‌ సైన్స్‌)

- 1981లో మంచిర్యాల మున్సిపల్‌ కౌన్సిలర్‌
- 1987లో మంచిర్యాల సింగిల్‌ విండో చైర్మన్‌
- 1982–1992 వరకు మంచిర్యాల బ్లాక్‌ కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి
- 1999 వరకు బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా పనిచేశారు
- 1999 అసెంబ్లీ ఎన్నికల్లో లక్సెట్టిపేట నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు.
- 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.
- 2015 నుంచి 2018 వరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ అండర్‌ టేకింగ్స్‌ కమిటీ చైర్మన్‌గా కొనసాగారు.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి టీఆర్‌ఎస్‌ నుంచే పోటీచేసి విజయం సాధించారు.

ఆదిలాబాద్‌ నియోజకవర్గం





పేరు :జోగు రామన్న
తల్లిదండ్రులు: జోగు ఆశన్న, భోజమ్మ
భార్య : రమ
కుమారులు : ప్రేమేందర్, మహేందర్‌
స్వగ్రామం : దీపాయిగూడ, జైనథ్‌ మండలం
విద్యార్హత : బీఏ
రాజకీయ ప్రస్థానం..

- 1984లో టీడీపీలో చేరిక
- 1988 నుంచి 1995 వరకు దీపాయిగూడ సర్పంచ్‌గా, మండల పరిషత్‌ ఉపాధ్యక్షునిగా పనిచేశారు.
- 1995 నుంచి 2001 వరకు జైనథ్‌ ఎంపీపీగా..
- 2001 నుంచి 2009 వరకు జైనథ్‌ జెడ్పీటీసీగా
- 2004 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి ఓడిపోయారు.
- 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- 2010లో తెలంగాణ నగారా సమితిలో చేరిక
- 2011లో టీఆర్‌ఎస్‌లో చేరి 2012 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు.
- 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరించారు.
- 2019 సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

బోథ్‌ నియోజకవర్గం





పేరు : అనిల్‌జాదవ్‌
తల్లిదండ్రులు : యశోద, జాదవ్‌ రామారావు
భార్య : హరిప్రియ
కూమారులు :ఆర్యన్, అర్జున్‌
పుట్టినతేదీ : 16–06–1972
స్వస్థలం: రాజురా
మండలం: నేరడిగొండ
నియోజకవర్గం: బోథ్‌ (ఎస్టీ)
విద్యార్హతలు :బీఏ, పొలిటికల్‌ సైన్స్‌
రాజకీయ ప్రస్థానం:

- 2001లో టీఆర్‌ఎస్‌లో చేరిక, 2004 ఎన్నికలలో టికెట్‌ ఆశించారు. చివరి నిమిషంలో సోయం బాపురావు పార్టీలో చేరి టికెట్‌ దక్కించుకోవడంతో టీఆర్‌ఎస్‌ పార్టీలో ఉండి 'సోయం' గెలుపు కోసం కృషి చేశారు.
- 2007 లో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు.
- 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు.
- 2018లో ఇండిపెండెంట్‌గా అభ్యర్థిగా పోటీ
- 2019 మార్చి 21న బీఆర్‌ఎస్‌లో చేరిక.
- 2019లో జరిగిన పరిషత్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ నుంచి పోటీచేసి నేరడిగొండ జెడ్పీటీసీగా విజయం సాధించారు.

ఖానాపూర్‌ నియోజకవర్గం





పేరు : భూక్య జాన్సన్‌ నాయక్‌
తల్లిదండ్రులు : భూక్య శామ్యూల్‌నాయక్, కేస్లీబాయి
పుట్టినతేదీ : 06–06–1976
భార్య : జయలక్ష్మి
సంతానం : కుమారుడు
విద్యార్హత : జెనిటిక్స్‌లో డిగ్రీ, కంప్యూటర్‌ అప్లికేషన్స్‌లో పీజీ డిప్లొమా
పుట్టిన ఊరు: తిమ్మాపూర్‌ తండా, మం.ఇబ్రహీంపట్నం, జి.జగిత్యాల
రాజకీయ ప్రస్థానం
2009లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు.
2014లో జరిగిన పార్లమెంట్‌ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంపీ టికెట్‌కోసం ప్రయత్నాలు చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరు

• ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య

రామకృష్ణాపూర్‌(చెన్నూర్‌): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ రాజీలేని పోరాటాలు సాగిస్తోందని ఆ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. పట్టణంలోని యూనియన్‌ కార్యాలయంలో సోమవారం ఏఐటీయూసీ బ్రాంచి 12వ మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసే కేంద్రం కుట్రలను అడ్డుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రైవేటీకరణ బారి నుండి సింగరేణిని కాపాడుకునేందుకు ఏఐటీయూసీ ఎలాంటి పోరుకైనా సిద్ధమన్నారు. కార్మికుల పక్షాన అనేక ఉద్యమాలు సాగించిన యూనియన్‌ కేవలం ఏఐటీయూసీనేనని రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు తమ సంఘం పక్షాన అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 25 నుండి 27 వరకు గోదావరిఖనిలో నిర్వహించనున్న ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు కలవేన శంకర్, జిల్లా, పట్టణ కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మిట్టపెల్లి శ్రీనివాస్, యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

బ్రాంచి నూతన కమిటీ ఎన్నిక

ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడిగా ఇప్పకాయల లింగయ్య, కార్యదర్శిగా ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా సురమల్ల వినయ్, కోశాధికారిగా పుష్పరాజ్, మైనింగ్‌ స్టాఫ్‌ ఇన్‌చార్జిగా రాజేశ్వర్‌రావును ఎన్నుకున్నారు.

సింగరేణిలో కొత్త భూగర్భ గనులు ప్రారంభించాలి

బెల్లంపల్లి: సింగరేణిలో కొత్తగా భూగర్భ గనులను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు, బెల్లంపల్లి బ్రాంచ్‌ కార్యదర్శి దాగం మల్లేశ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్త గనులకోసం ఏఐటీయూసీ పోరాడుతుందన్నారు. బెల్లంపల్లి బ్రాంచ్‌ 16వ మహాసభలో కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు చిప్ప నర్సయ్య, బియ్యాల వెంకటస్వామి, నాగేశ్వర్‌రావు, మీనుగు లక్ష్మీనారాయణ, దాసరి శ్రీధర్, మంతెన రమేశ్, బోస్, గొల్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఇద్దరు బైక్‌ దొంగల అరెస్టు

కౌటాల(సిర్పూర్‌): ఆరుబయట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను అపహరించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై మధుకర్‌ తెలిపారు. ఈ నెల 20న దీపెన్‌ మండల్‌ అనే పెయింటర్‌ తన మోటర్‌ సైకిల్‌ చోరీకి గురైనట్లు కౌటాల పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం కౌటాల మినీ స్టేడియం ఎదుట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్రలోని మర్పల్లి గ్రామానికి చెందిన జాడె రోహన్‌ లక్ష్మణ్, సిర్పూర్‌(టి) మండలంలోని కర్జపల్లి గ్రామానికి చెందిన మౌల్కర్‌ సుకుదేవ్‌లను గుర్తించి వారి వద్ద నుంచి మూడు మోటార్‌ సైకిళ్లను రికవరీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



అరెస్టు చూపిస్తున్న ఎస్సై మధుకర్‌

పోలీసుల దృష్టికి 'రూ. వెయ్యి ఇచ్చుకోండి'

సాక్షి ఎఫెక్ట్‌..

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): 'రూ. 70 వేలు కావాలా.. రూ.వెయ్యి ఇచ్చికోండి' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బీజేపీ స్పందించినట్లు తెలుస్తోంది. పార్టీ మండల బాధ్యులు సోమవారం హాజీపూర్‌ ఎస్సై నరేశ్‌కుమార్‌ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లినట్లు సమాచారం. వసూళ్లపై తగిన విచారణ జరిపేలా చూడాలని విన్నవించినట్లు తెలుస్తోంది.

వసూలు చేస్తోంది బీజేపీ కార్యకర్త కాదు..

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ నిర్వాసితుల నుంచి డబ్బులు వసూలు చేస్తోంది బీజేపీ కార్యకర్త కాదని పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇందుకు తాము ఎలాంటి చర్చకైనా సిద్ధంగా ఉన్నామని, అధికార పార్టీకి చెందిన కొంత మంది తమపార్టీకి చెడ్డపేరు తీసుకు రావాలని చూస్తున్నారని ఆరోపించారు. పార్టీలో ఎవరైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

భర్తను హతమార్చిన భార్యకు జీవిత ఖైదు

ఆసిఫాబాద్‌: వివాహేతర సంబంధానికి అడ్డుపడుతున్నాడని భర్తకు కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలిపి హతమార్చిన భార్యకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్‌ సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్‌ అధికారి మహ్మద్‌ బషీరొద్దీన్‌ తెలిపారు. రెబ్బెన మండలం లక్ష్మీపూర్‌కు చెందిన చౌదరి శంకర్‌ భార్య రూపకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో జూలై 1, 2019న థమ్స్‌అప్‌లో పురుగుల మందు కలిపి హతమార్చింది. మృతుని తల్లి యశోద ఫిర్యాదు మేరకు రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో అప్పటి సీఐ అశోక్‌ కేసు నమోదు చేశాడు. 20 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు..!

మందమర్రిరూరల్‌(చెన్నూర్‌): మందమర్రి మండలం పొన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో గల భక్త హనుమాన్‌ విగ్రహం ఎదుట సోమవారం గుప్తనిధుల కోసం తవ్విన ఆనవాళ్లు కనిపించాయి. నాగుల పంచమి సందర్భంగా పుట్టవద్దకు వెళ్లిన భక్తులకు పుట్టకింద సుమారు మూడు మీటర్ల దూరం వరకు చింత చెట్టు వేర్లను నరికివేసి తవ్వినట్లు కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. అంతేకాకుండా విగ్రహం వద్ద మద్యం, వాటర్‌ బాటిళ్లు ఉన్నట్లు వారు పేర్కొన్నారు.



తవ్విన ఆనవాళ్లు

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

ధర్మపురి: ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై దత్తాత్రి తెలిపిన ప్రకారం సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌ మండలం పెద్దంపేటకు చెందిన ఓ వ్యక్తితో జైనా గ్రామానికి చెందిన గడ్డి జ్యోతికి వివాహమైంది. దంపతులకు ఇద్దరు సంతానం. మహిళ భర్త కరీంనగర్‌లో తాపీమేస్త్రీగా పనిచేస్తుండగా కుటుంబంతో కలిసి అక్కడే ఉంటున్నారు. కొంతకాలంగా కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన జ్యోతి తన కుమారుడు, కూతురితో కలిసి పుట్టింటికి జైనాకు వచ్చింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ధర్మపురిలోని గోదావరి నది వద్దకు చేరుకుంది. సంతోషిమాత మెట్ల వద్ద అదోలా ఉండగా గమనించిన భక్తులు డయల్‌ 100 నంబరుకు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై దత్తాత్రి సంఘటన స్థలానికి చేరుకుని వారిని ఠాణాకు తీసుకెళ్లారు. భర్తను రప్పించి ఇద్దరికీ కౌన్సిలింగ్‌ ఇచ్చి ఇంటికి పంపించారు.

కలెక్షన్‌ ఏజెంట్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

ఆసిఫాబాద్‌: కాగజ్‌నగర్‌ మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ సమీపంలో శ్రీరామ్‌ చిట్‌ఫండ్‌ ఫైనాన్స్‌కు చెందిన కలెక్షన్‌ ఏజెంట్‌ ప్రమోద్‌ సింగ్‌పై సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపర్చారు. ఈజ్‌గాంలో డబ్బులు కలెక్షన్‌ చేసుకుని కాగజ్‌నగర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బీరు సీసాలతో దాడిచేసి బ్యాగులో ఉన్న రూ.35 వేల నగదును అపహరించారు. క్షతగాత్రుడిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కాగజ్‌నగర్‌ రూరల్‌ సీఐ నాగరాజు తెలిపారు.

చిరుత దాడిలో మేక మృతి

వేమనపల్లి(బెల్లంపల్లి): మండలంలోని కల్లెంపల్లి అటవీప్రాంతంలో చిరుత సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వారం రోజుల క్రితం సిడాం లక్ష్మణ్‌కు చెందిన మేకను హతమార్చగా సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలో సిడాం సుధాకర్‌కు చెందిన మేకపై దాడికి పాల్పడింది. మేకల మందతో సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా ఊరి సమీపంలోనే మాటు వేసిన చిరుత మేకల మందపై దాడి చేసి ఒక మేకను చంపింది. పది హేను రోజులుగా చిరుత గ్రామ సమీపంలోనే సంచరిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయమై అటవీ అధికారులకు సమాచారం అందించినట్లు బాధితుడు సుధాకర్‌ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జన్నారం: ఈ నెల 18న ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై సతీశ్‌ తెలిపారు. జన్నారం మండలం కవ్వాల్‌ గ్రామానికి చెందిన గొల్లపెల్లి రాజన్న (60) అనే గీత కార్మికుడు వృత్తిలో భాగంగా ఈత చెట్లు గీయడానికి కొత్తపేటకు వెళ్లి తిరిగివస్తుండగా కవ్వాల్‌ గ్రామానికి చెందిన అయూబ్‌ఖాన్‌ ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెనుకనుంచి వచ్చి ఢీకొట్టాడు. ఘటనలో రాజన్నకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.